ప్రజా **రిపబ్లిక్**

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 39 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు : 3 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | శుక్రవారం 13 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# కేజ్రీవాల్‌జికు భారీ ఊరట.. బెయిల్ మంజూరుచేసిన సుప్రీం

**మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవాల్కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.**



ఢిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ఢిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన అవకతవకల వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఈ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ కేసులో సుప్రీంకోర్టుఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన తిహాడ్ జైలు నుంచి బయటకు రానున్నారు. మద్యం విధానానికి సంబంధించిన సీబీఐ కేసులో తన అరెస్టును సవాల్ చేయడంతో పాటు.. బెయిల్ కోసం అభ్యర్థిస్తూ కేజీవాల్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు వెలువరించింది. రూ.10లక్షల పూచీకత్తు, ఇద్దరు షూరిటీలతో ఈ బెయిల్ మంజూరుచేసింది. కేసు గురించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని ఆదేశించింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేజీవాల్ అరెస్టుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "సుదీర్ఘంగా నిర్బంధించడం అంటే.. వ్యక్తి హక్కులను హరించినట్లే. ఈ కేసులో అరెస్టు సరైందే అయినప్పటికీ.. చేసిన సమయం మాత్రం సరిగా లేదు. ఈడీ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ అరెస్టు చేయడం సమంజసం కాదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రతీ వ్యక్తికి 'బెయిల్ అనేది నిబంధన.. జైలు మినహాయింపు'గా ఉండాలి అని మరోసారి వెల్లడించింది. సీబీఐ పంజరంలో చిలుక కాదని నిరూపించుకోవాలని వ్యాఖ్యానించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 21న ఈడీ అధికారులు కేజీవాల్ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం లోక్సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేయగా.. జైలు నుంచి విడుదలయ్యారు. ఆ గడువు ముగియడంతో జూన్ 2న తిరిగి లొంగిపోయారు. కాగా.. ఈ కేసులో జూన్ 20న రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ సీఎంకు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. కానీ, దీనిపై ఈడీ అభ్యంతరం వ్యక్తంచేయడంతో మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. అనంతరం జూన్ 25న బెయిల్పై స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో జులైలో ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈడీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు నుంచి బెయిల్ వచ్చిన వెంటనే సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. దీంతో ఈడీ కేసులో ఊరట లభించినప్పటికీ.. ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైల్లో ఉండాల్సి వచ్చింది.

# వరదలతో నష్టం.. ఆర్ అండ్ బి శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష


**ఏపీ సచివాలయంలో రహదారులు భవనాలు శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: రాష్ట్ర సచివాలయంలో రహదారులు భవనాలు శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టం అంచనాపై అధికారులతో సీఎం చర్చించారు. మధ్యాహ్నం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయానికి ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లనున్నారు. వరద బాధితులకు సహాయంలో భాగంగా బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీల ప్రతినిధులతో సీఎం మాట్లాడనున్నారు.

# రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్.. భయానక పరిస్థితి

**మహారాష్ట్ర, థానే జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ కావడంతో స్థానికులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.**



థానే, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: మహారాష్ట్రలోని రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ అవడంతో భయానక పరిస్థితి నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. థానే జిల్లా అంబర్నాథ్ ప్రాంతంలోని ఓ రసాయన పరిశ్రమలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో గ్యాస్ లీక్ అయ్యింది. నగరం మొత్తం దట్టమైన పొగ కమ్ముకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గంటల వ్యవధిలోనే స్థానికంగా ఉన్న ప్రజలు రసాయన వాయువుల ప్రభావానికి గురయ్యారు. స్థానికుల్లో చూపు మందగించడం, కళ్లు, గొంతులో మంట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు మొదలైన సమస్యలు వస-్తున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. వెంటనే రంగంలోకి దిగిన థానే మున్సిపల్ కార్పొరేషన్ (టీఎంసీ) విపత్తు నిర్వహణ విభాగం ప్రజలను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, పరిస్థితులు అదుపులో ఉన్నాయని టీఎంసీ చీఫ్ యాసిన్ తాడ్వి తెలిపారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, సమస్యలు ఉన్నవారు వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఫ్యాక్టరీలో ఫాస్పరస్ సంబంధిత రసాయనం లీక్ అవడం వల్ల దట్టమైన తెల్లటి పొగ చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించిందని అధికారులు తెలిపారు. తాత్కాలికంగా కంపెనీని మూసివేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిబంధనలు లేకుండా తక్షణ సాయం విడుదల చేయండి:

# కేంద్ర బృందానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

**తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరద నష్టం అంచనాపై సచివాలయంలో కేంద్ర బృందంతో ఆయన సమావేశ-మయ్యారు. వరదల నివారణకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ ఉండాలన్నారు. రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలు లేకుండా తక్షణ సాయం నిధుల విడుదలకు విజ్ఞప్తి చేశారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

# 18న ఏపీ క్యాబినెట్ సమావేశం

ఈనెల 18న సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరగనుంది. అమరావతిలోని సచివాలయంలో ఉదయం 11 గంటలకు క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నారు. ఈనెల 15 సాయంత్రం 4 గంటల్లోగా దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం అన్నిశాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

# రూ.2.70 కోట్ల కరెన్సీతో గణనాథుడికి ప్రత్యేక అలంకరణ

**వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా కొలువైన గణనాథుడు పూజలు అందుకుంటున్నాడు.**



నందిగామ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా కొలువైన గణనాథుడు పూజలు అందుకుంటున్నాడు. పలువురు తమ అభిరుచికి తగినట్లుగా ఏర్పాటు చేసిన మండపాలతోపాటు విభిన్న రూపాల్లో గణపతులను పూజిస్తున్నారు. ఈ కోవలోనే ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కొలువైన పార్వతీపుత్రుడు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని వాసవీ మార్కెట్లో 42వ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. గణపతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని రూ.2.70 కోట్ల కరెన్సీతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో భక్తులు మహాగణపతిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది : హరీశ్ రావు

**రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్రావు ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి సహా పలువురు భారాస నేతల గృహనిర్బంధం నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు.. కౌశిక్ రెడ్డి ఇంటిపై రాళ్లదాడి చేసిన వారికి రాచమర్యాదలు చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డిపై దాడి జరిగినప్పుడు డీజీపీ ఎందుకు స్పందించలేదని, భారాస నేతలపై దాడులు జరిగితే పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. గురువారం జరిగిన ఘటనకు సీఎం రేవంత్‌రెడ్డే కారణమని అన్నారు. అరెకపూడి గాంధీని గురువారమే హౌస్ అరెస్ట్ చేసి ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగేది కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అరాచక పాలన గురించి రాహుల్ గాంధీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును పక్కదారి పట్టించడానికే కౌశిక్‌రెడ్డిపై దాడికి దిగారని ఆరోపించారు. మాపై ఎన్ని రాళ్లు వేస్తారో వేయండి.. వాటితోనే మళ్లీ అధికారంలోకి వస్తాం అని హరీశ్ రావు అన్నారు.

# గణేశ్ నిమజ్జనం.. 25 వేల మందితో బందోబస్తు: సీపీ

**నగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: నగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళు-తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు. 17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్సాగర్ పరిసరాలకు వస్తారని చెపా-్పరు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు.

# కొల్లు రవీంద్ర పాస్పోర్టు ప్రక్రియ క్లియర్ చేయండి: హైకోర్టు ఆదేశం

**ఏపీ హైకోర్టులో మంత్రి కొల్లు రవీంద్రకు ఊరట లభించింది. ఆయన పాస్పోర్టు ప్రక్రియ క్లియర్ చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.**




అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ఏపీ హైకోర్టులో మంత్రి కొల్లు రవీంద్రకు ఊరట లభించింది. ఆయన పాస్పోర్టు ప్రక్రియ క్లియర్ చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసులకు సంబంధం లేకుండా పాస్పోర్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్లో ఉన్నాయన్న కారణంగా తన పాస్పో-ర్టును పునరుద్ధరించకపోవడం సరికాదని కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు అమెరికాలో జరగనున్న మైన్ ఎక్స్పో కార్యక్రమంలో తాను పాల్గొనాల్సి ఉందన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంవీ రమణకుమారి వాదనలు వినిపించారు. క్రిమినల్ కేసులు పెండింగ్లో ఉన్నాయనే కారణంతో పాస్పోర్టును తిరస్కరించొద్దని సుప్రీంకోర్టు, హైకోర్టులు పలు సందర్భాల్లో తీర్పులిచ్చాయని గుర్తు చేశారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## తెదేపాలో చేరిన జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపాలిటీ తెదేపా వశమైంది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జగ్గయ్యపేట వైకాపా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వైకాపా శ్రేణులు తెదేపాలో చేరారు.



జగ్గయ్యపేట, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపాలిటీ తెదేపా వశ-మైంది. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జగ్గయ్యపేట వైకాపా మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వైకాపా శ్రేణులు తెదేపాలో చేరారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఆయనతోపాటు పలువురు వార్డు కౌన్సిలర్లు పార్టీలో చేరారు. 7వ వార్డు కౌన్సిలర్ పూసపాటి సీతారావమ్మ దంపతులు, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, కుమారుడు కృష్ణ, 23వ వార్డు కౌన్సిలర్ డి.రమాదేవి దంపతులు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి నారా లోకేశ్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా పార్టీ వీడతారనే ప్రచారం ఉందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య ఈసందర్భంగా తెలిపారు. అది ఆయన వ్యక్తిగత నిర్ణయంగా పేర్కొన్నారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఇక తెదేపా కైవసం చేసుకుందని తెలిపారు. అంతకుముందు 14మంది కౌన్సిలర్లు తెదేపాకు, 17మంది వైకాపాకు ఉన్నారన్న శ్రీరామ్ తాతయ్య... తాజా చేరికలతో తెదేపా బలం 18కి పెరిగిందని, వైకాపా బలం 13కి పడిపోయిందన్నారు. వైకాపా విధానాలు నచ్చకే చాలామంది ఆ పార్టీని వీడుతున్నారని అన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు విమర్శించారు.

## వైకాపా నేతల నుంచి ప్రాణహాని ఉంది..

## సీఎం నివాసానికి వచ్చిన మహిళ

వైకాపా నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ ఓ బాధితురాలు సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: వైకాపా నేతల నుంచి ప్రాణహాని ఉందంటూ ఓ బాధితురాలు శుక్రవారం సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్ బాధితురాలికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా భీమిలికి చెందిన జి. వెంకటలక్ష్మి.. స్థానిక వైకాపా నేత రమణ వద్ద 2021 నుంచి రూ.15 లక్షల చిట్టీ కడుతూ వచ్చానని తెలిపింది. ఇటీవల తనకు చిట్టీ నగదు చెల్లించాలని రమణను కోరగా.. తిరిగి చెల్లించకపోగా చంపేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించింది. తాను పలువురితో చిట్టీ కట్టించానని, వారంతా డబ్బు కట్టమని తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. రమణ మాత్రం డబ్బులు చెల్లించకపోగా గంజాయ్ బ్యాచ్ తన కూమార్తెలను చంపిస్తానని బెదిరించటంతో భయంతో ఇంటి నుంచి పారిపోయినట్లు చెప్పారు. గత రెండు వారాల నుంచి వివిధ ప్రాంతాల్లో తల దాచుకుంటూ చివరికి సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చానని తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ వెంకటలక్ష్మికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారంలో గత ప్రభుత్వం పై సుప్రీంకోర్టు అసహనం

ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారంలో గత ప్రభుత్వంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ఆంధ్రప్రదేశ్లో ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారంలో గత ప్రభుత్వంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారంపై హరిత ట్రైబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ... జేపీ పవర్ వెంచర్స్ దాఖలు చేసిన పిటిషన్పై మరోసారి జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మైష్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పలు అంశాలను లేవనెత్తింది. షోకాజ్ నోటీసులు, ఎఫ్ఎఆర్ లు అన్నీ ఈ ఏడాది జులై, ఆగస్టులోనే ఎందుకు ఉన్నాయని ప్రశ్నించింది. ఎక్కువ షోకాజ్ నోటీసులు ఒకే తరహాలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా.. జులై, ఆగస్టు వరకు నోటీసులు జారీ చేయడం, కేసులు నమోదు చేయడంలో ఎందుకు తాత్సారం చేశారని అడిగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాతే.. కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు మొదలుపెట్టినట్లు కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. ఇప్పటి వరకు 9 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమ మైనింగ్ను దాదాపు అరికట్టినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తమపై ఎక్కడా కేసు నమోదు చేయలేదని, తమపై అక్రమ మైనింగ్ ఆరోపణలు లేవని జేపీ వెంచర్స్ తరపు న్యాయవాది తెలిపారు. మైనింగ్ జరిపినప్పుడు తప్పక సమాధానం చెప్పాల్సిందే అని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది చెప్పారు.

### అసలేం జరిగిందంటే..

గతంలో ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారంలో అన్ని రకాల ఉల్లంఘనలు జరిపారని న్యాయవాది దండా నాగేంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో జేపీ వెంచర్స్కు హరిత ట్రైబ్యునల్ భారీ జరిమానా విధించింది. ట్రైబ్యునల్ ఆదేశాలను జేపీ పవర్ వెంచర్స్ సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జేపీ వెంచర్స్ దాఖలు చేసిన పిటిషన్పై విచారణలో భాగంగానే రాష్ట్రంలో అక్రమ మైనింగ్ నిలుపుదల చేయాల్సిందే అని గతంలో ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అక్రమాలపై తదుపరి చర్యలు కూడా తీసుకోవాలని ఆదేశించింది. ఈక్రమంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో తాజా నివేదికను నవంబర్ 14 లోపు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం మరోసారి శుక్రవారం ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 18న చేపట్టనున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

## నాతో మాట్లాడటానికి భారాసలో ఎవరూ లేరా?: అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ విమర్శించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ విమర్శించారు. భారాస ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై గాంధీ మరోసారి స్పందించారు. భారాస కౌశిక్ రెడ్డికి ఏమైనా పదవి ఇచ్చిందా? నాతో మాట్లాడటానికి భారాసలో ఎవరూ లేరా? అని ప్రశ్నించారు. “దేశ మహిళలను అవమానించేలా చీర, గాజుల గురించి మాట్లాడారు. నీ ఇంటికి వస్తా.. కండువా వేసి తీసుకెళ్తా అంటే అర్థమేంటి? ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తావా? కౌశిక్ రెడ్డి రౌడీయిజం చేయడం దేనికి? తీరు మార్చుకోవాలి. అతను రెచ్చగొట్టినందుకే నేను అలా మాట్లాడాల్సి వచ్చింది. మాపైనే భారాస నేతలు దాడి చేశారు. మేము ఒక్కరిపై కూడా దాడి చేయలేదు. నీ ఇంటికి వస్తే ఏం చేశావు.. రాళ్లు రువ్వావు, పూల కుండీలు విసిరావు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు నా గురించి పూర్తిగా తెలుసు. అందుకే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. కేసీఆర్ అంటే ఎప్పటికీ నాకు గౌరవమే. కేసీఆర్ మమ్మల్ని ఆదరించారు, ఆశీర్వదించారు. కానీ, కౌశిక్ రెడ్డి వంటి వాళ్లు ఉంటే పార్టీకి చెడ్డపేరు వస్తోంది. నోటికి అదుపులేని మనిషిని ఊరుమీదకు వదిలేశారు. అలాంటి వారి వల్లే అధికారాన్ని కోల్పోయాం. కౌశిక్ రెడ్డి వల్ల కేసీఆర్ గొప్ప మనస్తత్వానికి, గతంలో చేసిన సేవలకు చెడ్డపేరు వస్తుంది” అని గాంధీ అన్నారు.

## తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై శ్రీవారి భక్తులను అనుమతించాలి: పాయల్ శంకర్

తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై భక్తులను అనుమతించాలని ఏపీ సీఎం చంద్రబాబును ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు.



తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై భక్తులను అనుమతించాలని ఏపీ సీఎం చంద్రబాబును ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. తెలంగాణలో తితిదే నిర్వహించే కార్యక్రమాలను పెంచాలని కోరారు. ఇదే విషయాన్ని గత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో తితిదే కల్యాణ మండపాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారని పాయల్ శంకర్ తెలిపారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ చూపి తమ రాష్ట్రంలో తితిదే కార్యక్రమాలు నిర్వహించేలా నిధులు కేటాయించాలని కోరారు. మరోవైపు మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## పరిస్థితులు దెబ్బతీసే వ్యక్తులపై జీరో టాలరెన్స్: డీజీపీ

శాంతి భద్రతల విషయంలో రాజీపడకూడదని డీజీపీ జితేందర్ అన్నారు. ఇటీవలి పరిణామాల దృష్ట్యా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన భేటీ అయ్యారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: శాంతి భద్రతల విషయంలో రాజీపడకూడదని డీజీపీ జితేందర్ అన్నారు. ఇటీవలి పరిణామాల దృష్ట్యా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సీపీలతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణలో పరిస్థితులు దెబ్బతీసే వ్యక్తులపై జీరో టాలరెన్స్తో వ్యవహరిస్తామన్నారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించారు. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు భారాస నేతలను పోలీసులు ఇప్పటికే హౌస్ అరెస్టు చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలని అంతకు సీఎం రేవంత్రెడ్డి డీజీపీ జితేందర్కు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం పోలీసు యంత్రాంగంతో సమీక్షించాలని తెలిపారు.

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి మృతి

చిత్తూరు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.



చిత్తూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: చిత్తూరు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చిత్తూరు- బెంగళూరు ప్రధాన రహదారిపై పలమనేరు నియోజకవర్గ పరిధిలోని మొగిలి ఘాట్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలిలోనే ఆరుగురు మృతి చెందగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు వైపు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఒకదానికొకటి ఢీకొని మరో టెంపోపైకి దూసుకెళ్లడంతో ప్రమాదం జరిగింది.

## మూడో రోజు కొనసాగుతున్న ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ

ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ వరుసగా మూడోరోజు ముమ్మరంగా కొనసాగుతోంది.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ వరుసగా మూడోరోజు ముమ్మరంగా కొనసాగుతోంది. గేట్ల వద్ద చిక్కుకున్న 4 భారీ పడవలను బయటకు తీసేందుకు రంగంలోకి దిగిన నిపుణుల బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. కాకినాడ నుంచి వచ్చిన 14 మంది నిపుణుల బృందం నేతృత్వంలో భారీ బోట్లు బయటకు లాగేందుకు ఏర్పాట్లు చేసింది. ఒక్కోక్కటి 50 టన్నులకు పైగా బర-ువులాగే 7 శక్తిమంతమైన పడవలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. చిక్కుకున్న పడవలకు గొలుసులను కట్టి బయటకు లాగనున్నారు. ఇప్పటికే విశాఖకు చెందిన డైవింగ్ టీంతో ఒక బోటును రెండుగా ముక్కలు చేశారు. రెండుగా కోసిన ఈ బోటును తొలుత బయటకు లాగేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం మిగిలిన 3 బోట్లనూ భారీ పడవల సాయంతో బయటకు తీయనున్నారు. బ్యారేజీ గోడలు, గేట్లకు నష్టం జరగకుండా బోట్లను తీసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వీలైనంత త్వరలో బోట్లు బయటకు తీసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలకు రెండు కొత్త వందేభారత్ రైళ్లు :కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 13: తెలుగు ప్రజలకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కానుక అందించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు. నాగ్పూర్ - హైదరాబాద్, దుర్గ్ విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. దిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి మరో వందేభారత్ కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# పంచాయతీలకు పవన్‌తో కొత్త కళ

## 400 పంచాయతీలకు విరాళంతో పంచాయతీలకు బూస్టింగ్


### గ్రామాలలో రాజకీయంగా పట్టు బిగిస్తున్న జనసేన



అమరావతి సెప్టెంబర్ 13 (రిపబ్లిక్ న్యూస్): ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాల్లో మంచి జోష్ మీదున్న జనసేన పార్టీకి ఇప్పుడు రూరల్ ఓటు బ్యాంకు కూడా చేరువైంది. జనసేనకు స్థానికంగా బలం .. యువతే. ఇది పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. దీంతో గతంలో వచ్చిన ఓటు బ్యాంకు, ఇప్పుడు వచ్చిన ఓటు బ్యాంకు కూడా.. పట్టణస్థాయిలోనే కనిపిం చింది. జనసేన పోటీ చేసిన నియోజకవర్గాలను గమనించినా.. పట్టణ స్థాయిలోనే మెజారిటీ నియోజకవ ర్గాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నియోజకవర్గాలు తీసుకోలేదు. పోటీ చేయలేదు. దీంతో జనసేన విజయం నల్లేరుపై నడకే అయింది. 21 నియోజకవర్గాలు కూడా.. పట్టణాల్లోనే ఉ న్నాయి. ఒకటి రెండు తప్ప.. అన్నీ కూడా.. యువత ఓటు బ్యాంకును సొంతం చేసుకున్నాయి. అయితే.. ఇప్పుడు గ్రామీణ స్థాయిలోనూ జనసేన పునాదులు బలంగా పడుతున్నాయి. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో జనసేన బలంగా లేదన్న వారే.. ఇప్పుడు ఈ మాట చెబుతుండడం గమనార్హం. దీనికి కారణం.. తాజాగా పవన్ చేసిన ఓ కీలక పని. గ్రామీణ ప్రాంతాలకు వెన్నుదన్ను వంటి.. పంచాయతీ లకు ఆయన తాజాగా 4 కోట్ల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఇదేమీ చిన్న విషయం కాదు. దాదాపు 400 గ్రామ పంచాయతీలకు రూ. లక్ష చొప్పున ఆయన ఇచ్చిన నిధులు ప్రస్తుతం అక్కడ ఉన్న పరిస్థితి లో పెద్ద సాయమేనని చెప్పాలి. దీంతో పంచాయతీలకు పవన్ కళ్యాణ్ అండ ఉందని కొత్త బూస్టింగ్ వచ్చింది.వాస్తవానికి ప్రభుత్వాలు ఇవ్వాల్సిన సొమ్ములు.. పులుసులో కలిసిపోతు న్నాయి. ఏ ప్రభుత్వం ఉన్నా.. పంచాయతీలకు నిధులు ఇవ్వడం గగనంగా మారిపోయింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక్కటే కీలకంగా మారి అమలవుతున్న నేపథ్యంలో ఇతర పనులకు ప్రభు త్వాలు నిధులు ఇవ్వడం లేదు.దీంతో అనేక పంచాయతీలు.. విద్యుత్ బిల్లులు కూడా కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పవన్ చేసిన సాయం.. పంచాయతీలకు ఆర్థికంగా వెన్నుదన్ను అయింది. ఇది అక్కడితో అయిపోలేదు.. ఇప్పుడు గ్రామీణ స్థాయిలో పవన్ గురించే ఎక్కువగా చర్చ సాగుతోంది. నిన్న మొన్నటి వరకు లేని కళ పంచాయతీలకు రావడం వెనుక పవన్ ఉన్నారనే అంటున్నారు. ఈ రిజల్ట్.. ఆయన పార్టీకి.. ఓటు బ్యాంకును పెంచుకునేందుకు దోహదపడనుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1929: భారత స్వాతంత్ర్య సమరయోధుడు జతీంద్ర నాథ్ దాస్ మరణం (జ. 1904).
- 1940: తెలుగు వ్యంగ్య చిత్రకారుడు జయదేవ్ జననం.
- 1960: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జననం.
- 1969: ఆస్ట్రేలియా అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు షేన్ వార్న్ జననం.
- 1996: అమెరికన్ రాప్ కళాకారుడు తుపాక్ షకుర్ మరణం (జ.1971).
- 2012: భారత 21వ ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్ మిశ్రా మరణం (జ. 1926).



జతీంద్ర నాథ్ దాస్




జయదేవ్



కిరణ్ కుమార్ రెడ్డి



షేన్ వార్న్



తుపాక్ షకుర్




రంగనాథ్ మిశ్రా

## రిపబ్లిక్ సినిమా CINEMA

### జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ.. ఆ దర్శకుడి సలహాయేనా!

ఎన్టీఆర్ మూవీతో జాన్వీ టాలీవుడ్కు ఎంట్రీ ఇస్తున్నారు. అయితే ఆమె ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేముందు ఒకరి సలహా తీసుకున్నట్లు తెలుస్తోంది.





శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీకి వచ్చిన జాన్వీకపూర్ వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బాలీవుడ్లో వరుస సినిమాలు చేస్తూనే టాలీవుడ్లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకున్నారు. అయితే ఈ అమ్మడు టాలీవుడ్కు ఎంట్రీ ఇవ్వడం వెనక ఓ స్టార్ దర్శకనిర్మాత ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్లో ఎంతో మంది నటీనటులు వారి కెరీర్ గురించి కరణ్ జోహార్ సలహాలు తీసుకుంటూ ఉంటారని టాక్. అలానే జాన్వీకి కూడా కరణ్ ఓ సూచన చేశారట. బీటౌన్లో తొలి అవకాశం అందుకున్న తర్వాత జాన్వీకు తమిళ, తెలుగులో ఛాన్సు వచ్చాయని దీంతో ఆమె కోలీవుడ్.. టాలీవుడ్లలో దేన్ని ఎంచుకోవాలో కరణ్ను సలహా కోరినట్లు సమాచారం. ఎన్టీఆర్ సినిమాతో టాలీవుడ్కు ఎంట్రీ ఇస్తే తెలుగులో మంచి ఛాన్సు వస్తాయని కరణ్ ఆమెతో చెప్పారట. దీంతో జాన్వీ వెంటనే 'దేవర'ను ఓకే చేసేశారు. కరణ్ సలహా ఈ భామకు కలిసొచ్చినట్లే ఇక్కడ స్టార్ హీరో సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు. ఎన్టీఆర్ తో సినిమా చేస్తుండగానే మెగా హీరో రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేశారు. నానితో కూడా ఓ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. బీటౌన్ లో జాన్వీ ఇప్పటి వరకు చిన్న హీరోల సినిమాల్లోనే నటించారు. కానీ, తెలుగులో మాత్రం తొలి సినిమానే ఎన్టీఆర్ ఆడిపాడనున్నారు. బాలీవుడ్లో స్టార్ హీరోయిన్స్కు పోటీ ఇవ్వలేని జాన్వీ.. ఇక్కడ మాత్రం టాప్ లిస్ట్ హీరోయిన్స్కు గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దేవర'లో ఇప్పటి వరకు రిలీజైన పాటల్లో జాన్వీ అందానికి, డ్యాన్స్కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. తాజాగా రిలీజైన 'దావుదీ..' సాంగ్ లో ఎన్టీఆర్ తో సమానంగా డ్యాన్స్ వేసిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. దీంతో ఈ సినిమా విడుదలయ్యాక జాన్వీ మరిన్ని అవకాశాలు అందుకోవడం ఖాయమని వారు భావిస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న 'దేవర' సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో జాన్వీ 'తంగం' పాత్రలో కనిపించనున్నారు. లంగా ఓణీతో పక్కా పల్లెటూరి అమ్మాయిగా అలరించనున్నారు. యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోన్న ఈ చిత్రం రిలీజ్కు ముందే పలు రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం విశేషం.

## రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

రొనాల్డో సరికొత్త చరిత్ర..

### 100 కోట్లు దాటిన ఫాలోవర్లు

ఫుట్బాల్ దిగ్గజం రొనాల్డోకు సోషల్మీడియా ఫాలోవర్ల సంఖ్య 100 కోట్లు దాటింది.



క్రిస్టియానో రొనాల్డో ఈ పేరు తెలియని ఫుట్బాల్ అభిమాని ఉండడు. పోర్చుగల్కు చెందిన స్టార్ ఫుట్బాల్ ప్లేయర్ ఇప్పుడు సోషల్ మీడియాలో సరికొత్త చరిత్రను లిఖించాడు. తన సోషల్ మీడియా ఖాతాలన్నింటిలో కలిపి ఫాలోవర్ల సంఖ్య ఏకంగా 100 కోట్లను దాటింది. సామాజిక మాధ్యమాల్లో ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఇతడే కావడం విశేషం. దీంతో అభిమానులకు కృతజ్ఞతలు చెబుతూ రొనాల్డో తాజాగా ప్రత్యేక పోస్ట్ చేశాడు. "మనం చరిత్ర సృష్టించాం.. 100కోట్ల ఫాలోవర్లు! ఇది కేవలం సంఖ్య మాత్రమే కాదు.. అంతకుమించిన మీ ప్రేమాభిమానాలకు నిదర్శనం. మడైరా వీధుల నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద వేదికల వరకు.. నేను ఎల్లప్పుడూ నా కుటుంబంతో పాటు మీ కోసమే ఆడాను. ఇప్పుడు వంద కోట్ల మంది నాకోసం నిలబడ్డారు. నా ఎత్తుపల్లాల్లో, ప్రతీ అడుగులోనూ మీరున్నారు. ఇది మన ప్రయాణం. మనమంతా కలిస్తే ఏదైనా సాధించగలమని నిరూపించాం. నాపై విశ్వాసం ఉంచి.. నాకు ఎల్లవేళలా అండగా ఉన్నందుకు, నా జీవితంలో భాగమైనందుకు మీ అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నేనింకా ఉత్తమ ప్రదర్శన చేయాల్సిఉంది. మరిన్ని విజయాలు సాధించి సరికొత్త చరిత్ర సృష్టించాలి" అని రొనాల్డో రాసుకొచ్చారు. ఇటీవల రొనాల్డో యూట్యూబ్లోకి అడుగుపెడుతూనే సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రారంభించిన సగం రోజులోనే ఫాలోవర్ల సంఖ్య కోటి దాటడం విశేషం. ప్రస్తుతం అతడి యూట్యూబ్ ఖాతాకు 6 కోట్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇక ఇన్స్టాలో ఈ ఫుట్బాల్ స్టార్ను 63.9కోట్ల మందికి పైగా అనుసరిస్తున్నారు. 'ఎక్స్'లో 11.3 కోట్ల మంది, ఫేస్బుక్లో 17 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

### కింగ్ వచ్చేశాడు.. లండన్ నుంచి నేరుగా చెన్నైకి చేరుకున్న విరాట్ కోహ్లి



బంగ్లాదేశ్తో టెస్టు సిరీస్లో భాగంగా తొలి మ్యాచ్ సెప్టెంబర్ 19న ప్రారంభం కానుంది. ఇప్పటికే జట్టును బీసీసీఐ ప్రకటించింది. చెన్నై వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. దీంతో క్రికెటర్లు చెపాక్ వద్దకు చేరుకుంటున్నారు. తాజాగా భారత స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి కూడా భారత్కు వచ్చేశాడు. లండన్ నుంచి నేరుగా చెన్నైకి రావడం గమనార్హం. ఇవాళ వేకువజామున 4 గంటలకు ఫ్లైట్ దిగి తన హొటల్ గదికి వెళ్లిపోయాడు. దాదాపు 18 నెలల తర్వాత సొంత గడ్డపై టెస్టు సిరీస్ ఆడనున్నాడు. గతేడాది మార్చిలో చివరిసారిగా ఇక్కడ టెస్టు ఆడాడు. ఇప్పుడు బంగ్లాతో తలపడేందుకు వచ్చాడు. ఇవాళ లేదా రేపు కానీ సన్నద్ధత క్యాంప్ లో మిగతా ఆటగాళ్లతో కలిసే అవకాశం ఉంది.

#### మరో 58 పరుగులు చేస్తే..

బంగ్లాతో రెండు టెస్టుల సిరీస్లో విరాట్ కోహ్లి మరో 58 పరుగులు చేస్తే చాలు అరుదైన ఘనతను సొంతం చేసుకుంటాడు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 27 వేలకు పైగా పరుగులు చేసిన బ్యాటర్గా నిలిచే అవకాశం కోహ్లి ముంగిట ఉంది. మరో 58 పరుగులు చేస్తే ఈ ఘనతను సాధిస్తాడు. సచిన్ 623 ఇన్నింగ్స్లో 27 వేల పరుగులు చేయగా.. కోహ్లి 591 ఇన్నింగ్స్ ల్లో 26,942 పరుగులతో ఉన్నాడు. ఓవరాల్గా 27 వేలు కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్లు ఇప్పటివరకు ముగ్గురే ఉన్నారు. సచిన్ (34,357) అగ్రస్థానంలో ఉండగా.. కుమార సంగక్కర (28,016), రికీ పాంటింగ్ (27,483) తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు.

## బ్యూటీ టిప్స్

### జుట్టు స్ట్రెయిటనింగ్ చేస్తే క్యాన్సర్ వస్తుందా

చాలా మందికి జుట్టు స్ట్రెయిట్‌గా నచ్చుతుంది. అందుకోసం చాలా మంది స్ట్రెయిటనర్స్ వాడతారు. కానీ, దీనిని రెగ్యులర్‌గా వాడితే కొన్ని సమస్యలుంటాయి. అవేంటో తెలుసుకోండి.



ఒకప్పుడు హీరోయిన్స్, సెలబ్రిటీలు మాత్రమే జుట్టుని స్ట్రెయిట్‌గా చేయించుకునేవారు.. కానీ, ఫ్యాషన్ ట్రెండ్స్ అందరికీ అందుబాటులోకి వచ్చేసరికి చాలా మంది ఇంట్లోనే స్ట్రెయిటనర్స్ వాడి జుట్టుని స్ట్రెయిట్‌గా చేసుకుంటున్నారు. దీంతో జుట్టు పొడవుగా కనిపిస్తుంది. చూడ్డానికి చక్కగా కనిపిస్తుంది. అయితే, అందం కోసం రెగ్యులర్‌గా స్ట్రెయిటనింగ్ చేస్తే కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. దీని వల్ల జుట్టు పాడవుతుంది. అవేంటో తెలుసుకోండి.

#### హెయిర్ డ్యామేజ్..

స్ట్రెయిటనింగ్ చేయడం వల్ల వల్ల మీ జుట్టు దెబ్బతింటుంది. దీని వల్ల జుట్టుని స్టైల్ చేయడం కష్టమవుతుంది. జుట్టు త్వరగా ఆరదు. దీని వల్ల జుట్టు బ్రేక్ అవుతుంది. డ్రైగా మారి గడ్డకట్టినట్లుగా కనిపిస్తుంది. అదే విధంగా, రెగ్యులర్‌గా స్ట్రెయిటనింగ్ చేస్తే జుట్టు దెబ్బతింటుంది. స్ట్రెయిటనింగ్ చేసినప్పుడు జుట్టు పొడుగ్గా కనిపిస్తుంది. కానీ, ఇది టెంపరరీ. రెగ్యులర్‌గా వాడితే జుట్టు దెబ్బతిని రాలుతుంది.





#### అలర్జీ..

స్ట్రెయిటనింగ్ వాడడం వల్ల జుట్టు పొడిబారి చుండ్రు, అలర్జీ సమస్యలు వస్తాయి. కొందరికీ జుట్టు పెరుగుదల పూర్తిగా ఆగిపోతుంది. స్ట్రెయిటనింగ్ చేసినప్పుడు కొన్ని కెమికల్స్ వాడతారు. దీని వల్ల మీ స్కాల్ప్ దెబ్బతింటుంది. దీనిని సరిగ్గా వాడకపోతే అది స్కాల్ప్ హెల్త్, జుట్టు ఆరోగ్యంపైనే ఎఫెక్ట్ చూపిస్తుంది.

#### కార్సినోజెన్స్‌తో సమస్య..

ఫార్మాల్డిహైడ్.. ఇది ఓ కార్సినోజెన్. ఇది ఎక్కువగా స్ట్రెయిటనింగ్ సొల్యూషన్స్‌లో కనిపిస్తుంది. ఈ ఫార్మాల్డిహైడ్ పొగని పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలు, చర్మం, కంటి సమస్యలు, రొమ్ము క్యాన్సర్స్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే, వీటిని వాడేటప్పుడు జాగ్రత్తలు అవసరం. డాక్టర్‌ని సంప్రదించాకే వాడాలి.





#### స్ట్రెయిటనింగ్ చేసేముందు..

జుట్టు రెగ్యులర్‌గా స్ట్రెయిటనింగ్ చేయడం అంత మంచిది కాదని గుర్తుపెట్టుకోండి. స్ట్రెయిటనింగ్ చేసే ముందు హెయిర్ ప్రొటెక్టర్ క్రీమ్ వాడండి. దీని వల్ల హెయిర్ డ్యామేజ్ అవ్వదు. కొంతమంది తడి జుట్టుపై స్ట్రెయిటనర్ వాడతారు. దీని వల్ల జుట్టుపై ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా జుట్టు ఆరిన తర్వాత స్ట్రెయిట్ చేస్తే నష్టం కాస్తా తగ్గుతుంది.

#### క్యాన్సర్స్..

కొన్ని పరిశోధనల ప్రకారం.. హెయిర్ స్ట్రెయిటనర్ కెమికల్స్ రెగ్యులర్‌గా వాడడం వల్ల క్యాన్సర్స్ వచ్చే రిస్క్ పెరుగుతుంది. యూటెరిన్ క్యాన్సర్, ఫైబ్రాయిడ్స్, బ్రెస్ట్ క్యాన్సర్, ఎండోమెట్రియోసిస్ ప్రమాదాలు వచ్చే అవకాశం పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ స్ట్రెయిటనింగ్ సొల్యూషన్స్ కారణంగా దీర్ఘకాలిక సమస్యలు పెరుగుతాయి. ఇది ముందుగా ఎవరు గమనించలేరు.



**గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.**